నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం 18 జూన్ 2023

కూతురు పెళ్లి కాదేమోనని తల్లి ఆత్మహత్య

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేటలోని మత్తడికిందిపల్లికి చెందిన నర్వ సవిత (36) తన కూతురు పెళ్లి కాదేమోనని తీవ్ర మన స్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు లింగంపేట ఎస్సై శంకర్ తెలిపారు . ఆయన వివరాల ప్రకారం.. లింగంపేట్‌కు చెందిన విఠల్ అనే యువకుడితో మూడు నెలల క్రితం పెండ్లి ఖాయం చేశారు. అయితే విట్టల్ కొద్ది రోజుల క్రితం వేరే అమ్మాయితో వెళ్లిపోయాడు. అప్పటినుంచి సవిత తన్ల కూతురు పెళ్లి విషయంలో తరచూ బాధపడుతూ ఉండేది. అయితే ఈ నెల 15న మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి.. అక్కడి నుంచి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భగ్గుమంటున్న ఎండ

- జంకుతున్న ప్రజలు

నవతెలంగాణ-మద్నూర్



జూన్ మూడో వారం సమీపిస్తున్నా.. ఎండలు భగ్గుమంటున్నాయి. భారీ ఎండలకు పాఠశాలలకు వెళ్లే విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు జంకుతున్నారు. విద్యార్థులు ఎండకు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమై వారం పది రోజులు గడిచినా.. చుక్క వర్షం పడకపోవడం ఎండాకాలం లాగే ఎండలు మండుతుండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ఎండకు ఎండుతూ..

నిలువ నీడకోసం పేదల ఆరాటం

- 30 రోజులుగా గుడిసెల్లోనే నివాసం
- స్థలాలు ఇవ్వడంలో సర్కారు జాప్యం
- రెవెన్యూ, పోలీసుల నుంచి బెదిరింపులు
- రియల్‌ఎస్టేట్ వ్యాపారుల హెచ్చరికలు
- ప్రాణాలు పోయినా ఇంచు కదలబోం : పేదలు
- పేదలందరికీ ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలి : సీపీఐ(ఎం)



ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కిరాయి ఇండ్లలో యజమానుల వేధింపులు, పెరిగిన అద్దెలు, నిత్యవసరాల ధరలతో ఆగమైన పేదలు.. సొంత గూటి కోసం జంగ్ సైరస్ ఊదింద్రు. ఎర్రజెండా అండతో ఇంటి స్థలాల కోసం పోరాటం చేశారు. ఈ పోరులో రెవెన్యూ, పోలీసుల నుంచి బెదిరింపులు ఎదురవుతున్నా వెనక్కి తగ్గకుండా ఐక్యత చాటుతున్నారు. 'మాకు నీలువ నీడ లేకుండా ఇక్కడి నుంచి కదిలేది లేదు' అని స్పష్టం చేస్తున్నారు. ప్రాణాలు పోయినా సరే స్వంత ఇంటి పోరులో వెనక్కి తగ్గపోబోమని స్పష్టం చేస్తున్నారు. 30 రోజులుగా ఎండనకా, వడగాలులనకా గుడిసెల్లోనే జీవిస్తున్నారు. అక్కడే వంటలు చేసుకుంటూ, రోజువారి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇక ఈ పోరులో పేదలకు సీపీఐ(ఎం) నాయకత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తోంది. ఈ పోరులో భుజం-భుజం కలిపి పోరుదారిలో ముందుకు నడుపుతున్నారు. ఇప్పటికే ఆ పార్టీ నుంచి రాష్ట్రనాయకులు వచ్చి పూర్తిస్థాయి సంఘీభావం ప్రకటించారు. దీంతో మరింత ఉత్సాహంతో ఇంటి స్థలాల కోసం పోరు చేస్తున్నారు.

తెలంగాణ ఆవిర్భావం నుంచి నిజామాబాద్ జిల్లా కేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇండ్లతో పాటు ఇండ్ల స్థలాల పంపిణీ జరగలేదు. రాష్ట్రం ఆవిర్భావం అయ్యాక తమకు స్వంత ఇండ్లు వస్తాయని ఆశించిన ప్రజల ఆశలు అడియాసలయ్యాయి. అయితే పేదల ఇండ్ల పంపిణీ అంశాన్ని సీపీఐ(ఎం) ప్రాధాన్యత తీసుకుంది. అందులో భాగంగా ఇండ్లు లేని నిరుపేదల నుంచి వార్డుల వారిగా దరఖాస్తులు స్వీకరించింది. దీంతో కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఇవే దరఖాస్తులను జిల్లా కలెక్టర్ ముందు పెట్టి లబ్ధిదారులకు న్యాయం చేయాలని అడిగారు. కానీ ఆశించిన ఫలితాలు రాలేదు. దీంతో ఇక చేసేదిలేక ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను సీపీఐ(ఎం) నాయకత్వం స్వీకరించింది. జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో సర్వే నెంబర్ 171, 172లలో ప్రభుత్వ భూమిని గుర్తించారు. ప్రస్తుతం ఈ స్థలంలో సుమారు 500 మంది గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. దాదాపు నెల రోజులుగా ఇవే గుడిసెల్లో వంట చేసుకోవడం, రోజువారి పని చేసుకోవడం చేస్తున్నారు. అద్దెల భారం ఎక్కువ కావడం, కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర ధరలు పెరగడంతో ఆర్థికంగా పూర్తిగా చితికిపోయారు. పైగా కిరాయి ఇండ్లకు వెళ్దామంటే ప్రస్తుతం కులం సమస్య ప్రధాన అడ్డంకింగా మారింది. ఏ ఇంటికి వెళ్లినా 'మీ కులం' ఏంటి అని అడుగుతున్నారని బాధితులు వాపోతున్నారు. ఒక చిన్న గదికి కూడా మూడు వేలు అద్దె చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. దీనికితోడు కరెంటు బిల్లు, బోరు బిల్లు అదనంగా చెల్లిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది కూలీలు, బీడీ కార్మికులు ఉండటంతో రోజువారీ ఆదాయం అంతా కిరాయిలకు, నిత్యావసరాల ఖర్చు అవుతున్నాయని, ఏదైనా రోగం వస్తే ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుందోని వాపోతున్నారు.

భర్త చనిపోతే ఆసుపత్రి నుంచి శ్మశానానికే తీసుకెళ్లా



కిరాయి ఇండ్లలో యజమానుల ఆగడాలు భరించలేకపోతున్నాం. మా ఆయన చనిపోతే ఇంటికి ముట్టుడు వస్తది అని యజమానులు దేహాన్ని ఇంటికి కూడా రానీయలేదు. గత్యంతరం లేక శవాన్ని ఆసుపత్రి నుంచి స్మశానం తీసుకెళ్లాం. గౌతంనగర్, కంఠేశ్వర్ తదితర ప్రాంతాల్లో 12 యేండ్లుగా కిరాయి ఇండ్లలోనే నివసించాం. డబుల్ బెడ్‌రూం ఇండ్లకు దరఖాస్తు చేశాను. కానీ ఇప్పటి వరకు రాలేదు. ఏ పార్టీ వాళ్ల సాయం చేయలేదు. ఒక్క సీపీఐ(ఎం) నాయకులే మా కోసం ముందుకు వచ్చారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో ఇప్పుడు గుడిసెలు వేసుకున్నాం. ఈ స్థలం నుంచి కదలబోం. గట్టిగా నిలబడతాం. **- మంజుల**

15 సంవత్సరాలుగా కిరాయి ఇండ్లలోనే



నిజామాబాద్‌లో 15 యేండ్లుగా కిరాయి ఇండ్లలోనే జీవిస్తున్నాం. వచ్చిన ఆదాయం అంతా కిరాయి చెల్లింపునకే సరిపోతోంది. ప్రతిసారి ఎన్నికల సమయంలో స్వంత ఇండ్లు ఇస్తామని ఆశ కల్పిస్తున్నారు. ఆ తరువాత మమ్మల్ని పట్టించుకోవడం లేదు. దీంతో గత్యంతరం లేక ఈ స్థలంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాం. ఈ ప్రాంతంలో మాకు స్వంత ఇండ్లు కట్టించి ఇవ్వాలి. చవనైనా చస్తాం కానీ ఈ స్థలం వదిలిపోం. ఇప్పటికే పోలీసుల్లో, రెవెన్యూ అధికారులు వచ్చారు. బెదరిస్తున్నారు. మేం మాత్రం వెనక్కు తగ్గబోం. **- శుభలక్ష్మి, గుడిసెవాసి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాట నిలబెట్టుకోవాలి



పేదలకు స్వంత ఇండ్లు నిర్మించి ఇస్తామన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ మాట నిలబెట్టుకోవాలి. దుబ్బ ప్రాంతంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు పట్టాలు ఇచ్చి ఇండ్ల నిర్మాణానికి ఆర్థికసాయం చేయాలి. కేంద్రం ఐదు లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో ఐదు లక్షలు ఇవ్వాలి. గుడిసెలను తొలగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే రెవెన్యూ, పోలీసు అధికారులతో భయపెట్టే ప్రయత్నం చేశారు. పేదల జోలికొస్తే ఊరుకోం. నగరంలో వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురైతే పట్టించుకోకుండా పేదలపై ప్రతాపం చూపడం సరికాదు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కొంతమంది గుడిసెలను తొలగించాలని కుట్రలు చేస్తున్నారు. జాగ్రత్త అని హెచ్చరిస్తున్నాం.
- సుజాత, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యురాలు

ఏసీబీ వలలో వీసీ

- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ రవీందర్ గుప్తా
- కాంట్రాక్టు నియామకాల్లోనే పెద్దఎత్తున లంచాలు
- ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు వసూలు
- టీయూ పరువు బజారుపాలు



ఏసీబీకి చిక్కిన వీసీ రవీందర్‌గుప్తా

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ యూనివర్శిటీలో వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన వైస్‌ఛాన్సలర్ రవీందర్ గుప్తా అనినీతి నిరోధక శాఖ వలలో చిక్కాడు. వీసీ(ఉపకులపతి)కి ఉన్న విచక్షణాధికారులను దుర్వినియోగం చేస్తూ కటకటాలపాలయ్యాడు. ఆర్మూర్ నరేంద్ర కాలేజీకి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రిన్సిపాల్ వద్ద వీసీ లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళిక ప్రకారం శనివారం హైదరాబాద్‌లోని తార్నాకలో తన నివాసంలో లంచం తీసుకుంటుండగా వీసీని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఏసీబీ ఓ ప్రకటనలో తెలిపింది. తెలంగాణ వీసీగా రవీందర్ నియామకం అయిన నాటి నుంచి వర్శిటీ ప్రతిష్ట మసకబారుతూ వచ్చింది. పెద్దఎత్తున అవినీతి, అక్రమాలకు తెరలేపారు. అవసరం లేకున్నా కాంట్రాక్టు పదవులు భర్తీ చేసి ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు వసూలు చేశాడు. ఇదేంటని తెలిసిన కొంతమంది ప్రస్తావిస్తే.. 'కోట్లు ఖర్చు పెట్టి వీసీ పదవి తెచ్చుకున్నానని' సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. చివరకు అవినీతికి పాల్పడుతూ కటకటాల పాలయ్యాడు.

తెలంగాణ యూనివర్శిటీకి వీసీగా రవీందర్ గుప్తా 22వ తేదీ మే నెల 2021లో బాధ్యతలు స్వీకరించారు. ఇష్టారాజ్యంగా రిజిస్ట్రార్‌లను నియమిస్తూ వీసీ వార్తల్లోకెక్కాడు. ఈసీ, ఉన్నతవిద్యామండలి అనుమతి లేకుండానే ఐదుసార్లు రిజిస్ట్రార్లను మార్చారు. అలాగే ఈసీ అనుమతి లేకుండా కోట్లాది రూపాయాలు ఖర్చు చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో 147 మందిని నియమించి ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారు. వారితో 3 నెలల పాటు పనులు చేయించుకొని జీతాలు ఇవ్వకుండా అవినీతికి పాల్పడ్డాడు. దీంతో పాలకమండలి ఈ అంశంపై సీరియస్ అయ్యింది. ఈ విషయం నిగ్గుతేల్చాలని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు లేఖ రాసింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు జూన్ 8న, 13న రెండు దఫాలుగా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను సేకరించారు. కంప్యూటర్‌లోని హార్డ్‌డిస్క్‌లను, బ్యాంకుకు సంబంధించిన లావాదేవీల రికార్డులను జప్తు చేశారు. హైదరాబాద్‌లో వీసీ 20 నెలల కాలంలో జరిపిన లావాదేవీల రికార్డులను జల్లడపడుతున్నారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా ఉన్నప్పటికీ.. మళ్లీ లంచాల బాట పట్టి చిక్కుకున్నారు.

ప్రశాంతమైందనుకున్న సమయంలో...

వీసీ పట్టువీడి పాలకమండలి నిర్ణయం మేరకు రిజిస్ట్రార్‌గా శుక్రవారం యాదగిరిని నియమించారు. దీంతో ఇక టీయూలో జరిగిన వివాదాలకు తెరపడిందని అంతా భావించారు. గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు సైతం సమ్మె వీడారు. అంతా సర్దుమణిగిందని భావించిన సమయంలో వీసీ ఏసీబీకి చిక్కి కటకటాలపాలయ్యాడు. అయితే వీసీని బర్తరఫ్ చేయాలని సర్కారు ఇప్పటికే గవర్నర్‌కు సిఫార్సు చేసింది. కానీ ఆ ఫైల్ పెండింగ్‌లో ఉంది.

మూల్యాంకన విధుల్లో చేరకపోతే చర్యలు : డీఐఈవో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

2023 జూన్ ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం మొదటి స్పెల్ ఈనెల 21న ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ తెలిపారు. 21న నిజామాబాద్‌లో జవాబు పత్రాల మూల్యాంకనం విధులలో చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు రిపోర్టు చేయాలని ఆదేశించారు. మొదటి స్పెల్‌లో సంస్కృతం, ఆంగ్లము, తెలుగు, హిందీ, గణిత శాస్త్రము, పౌరశాస్త్రం జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభ మవుతుందని అన్నారు. రెండవ స్పెల్ 24న ప్రారంభమవుతుందని, రెండవ స్పెల్‌లో భౌతికశాస్త్రం, అర్థశాస్త్రము, వృక్షశాస్త్రము, జంతుశాస్త్రము జవాబు పత్రాల మూల్యాంకనం ఉంటాయని అన్నారు. 26న మూడవ స్పెల్‌లో రసాయన శాస్త్రం, వ్యాపార గనక శాస్త్రం, చరిత్ర సబ్జెక్టుల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం అవుతుందని డీఐఈఓ తెలిపారు.

మూడేండ్లని ఐదేండ్లు అగ్రిమెంట్ రాశారు..

- లీజుకు ఇచ్చిన భూములు తిరిగివ్వాలి
- మంచిప్ప భూ బాధితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న భూ బాధితులు

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామంలో గల కాళేశ్వరం 21 ప్యాకేజీ పనుల దగ్గర నవయుగ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి లీజుకి ఇచ్చిన భూములు తిరిగి ఇవ్వాలని భూ బాధితులు శనివారం ఆందోళన చేపట్టారు. ఐదు సంవత్సరాల క్రితం నవయుగ కన్‌స్ట్రక్షన్ కంపెనీ యాజమాన్యం ప్రాజెక్టు నిర్మాణ అవసరాల నిమిత్తం చింతకుంట రాములు వద్ద రెండున్నర ఎకరాలు, గుండ్ల సాయిలు, దిమ్మరి పోషవ్వ, వడ్ల బ్రహ్మం, కోసిడిగా గంగారం వద్ద ఐదుగుంటలు చొప్పున భూమిని లీజుకు తీసుకుంది. ఈ భూమిని లీజుకు తీసుకునే సమయంలో కేవలం మూడు సంవత్సరాల అగ్రిమెంట్ అని చెప్పి బలవంతంగా తమ దగ్గర భూమిని తీసుకొని ఐదు సంవత్సరాల అగ్రిమెంట్‌గా రాయించుకున్నారని, లీజుకిచ్చే సమయంలో ఇవ్వడం ఇష్టం లేకపోయినా బలవంతంగా తన బలగాన్ని ఉపయోగించి తమకు ఇబ్బంది పెట్టి మరీ తీసుకున్నారని బాధితులు తెలిపారు. ఐదు సంవత్సరాల అగ్రిమెంట్ పూర్తయిన సందర్భంగా తమ భూములు తమకు ఇవ్వాలని, తాము వ్యవసాయం చేసుకొని తమ జీవనాన్ని కొనసాగిస్తామని తెలిపారు. బాధితులలో ఒకరైన చింతకుంట రాములు ఆత్మహత్య చేసుకుంటానని ప్రాజెక్టు సమీపంలో ఉన్న ఎత్తయిన మిక్సింగ్ టవర్ ఎక్కాడు. దీంతో అక్కడే ఉన్న రైతులు సముదాయించడంతో కిందకు దిగాడు.



మిక్సింగ్ టవర్ ఎక్కిన రైతు

ట్రాన్స్ జెండర్ల పట్ల వివక్ష తగదు

- వారిని సాటి మనుషులుగా గౌరవించాలి
- హైకోర్టు న్యాయమూర్తి పి.శ్రీసుధ
- ఘన స్వాగతం పలికిన జిల్లా జడ్జి, కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



పాలసీ బాండ్‌ను అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ

ట్రాన్స్ జెండర్లను సాటి మనుషులుగా గుర్తిస్తూ వారి పట్ల గౌరవప్రదంగా వ్యవహరించాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్రీసుధ హితవు పలికారు. జిల్లా కోర్టు భవన సముదాయంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్లు, సెక్స్ వర్కర్లకు పోస్టల్ శాఖ ద్వారా అమలవుతున్న గ్రూప్ ఆక్సిడెంటల్ పాలసీ బాండ్‌లను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు జడ్జి శ్రీసుధ, ట్రాన్స్ జెండర్ల సమస్యలను హృద్యంగా చిత్రీకరిస్తూ అష్ట గంగాధర్ రూపొందించిన వీడియోతో కూడిన పాటను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్రీసుధ మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్ల పట్ల వివక్ష చూపడం ఎంతమాత్రం తగదని, రాజ్యాంగంలో కూడా ఇదే విషయం ప్రస్తావించబడిందని అన్నారు. ట్రాన్స్ జెండర్లను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ, వారికి సమాన అవకాశాలు లభించేలా కృషి చేయాలన్నారు. పోస్టల్ శాఖ ద్వారా కేవలం రూ.399 ప్రీమియంతో 10 లక్షల రూపాయల ప్రమాద బీమాతో పాటు ఇతర అనేక ప్రయోజనాలు కలిగి ఉన్న గ్రూప్ ఆక్సిడెంటల్ పాలసీ గార్డ్‌ను ట్రాన్స్ జెండర్లు, సెక్స్ వర్కర్లకు వర్తింపజేయడం అభినందనీయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులను ప్రశంసించారు. ఇతర సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ డీ.ఎల్.ఎస్.ఏ ముందంజలో నిలుస్తోందని కొనియాడారు. భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సాంకేతిక అభివృద్ధి కారణంగా నేటి సమాజంలో అనేక మంది పోస్టల్ శాఖను మర్చిపోయారని, ఫలితంగా ఆ శాఖ ద్వారా అమలవుతున్న ప్రమాద బీమా వంటి ప్రయోజనాలను పొందలేకపోతున్నారని అభిప్రాయపడ్డారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనాలు అందిస్తున్న పోస్టల్ శాఖ ప్రమాద బీమా పాలసీ గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. జిల్లా జడ్జి కె.సునీత మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లకు ఏదైనా మేలు చేకూర్చాలని తలంపుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. దాతలు ముందుకు వచ్చి సుమారు రూ.30 వేలు విరాళం అందించగా, దానిని ప్రీమియం కోసం వెచ్చిస్తూ 50 మంది ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లకు ఉచితంగా బీమా బాండ్లు న్యాయసేవ అధికార సంస్థ అందజేసినట్టు తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సహకరిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం హైకోర్టు జడ్జి న్యాయాధికారులతో భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు.

హైకోర్టు జడ్జికి ఘన స్వాగతం

హైకోర్టు జడ్జి బి.శ్రీసుధ శనివారం నిజామాబాద్ పర్యటనకు హాజరైన సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆమె స్థానిక రోడ్లు-భవనాల శాఖ అతిథి గృహం వద్దకు చేరుకోగా, జిల్లా జడ్జి కె.సునీత, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, ట్రైనీ అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, నిజామాబాద్ ఆర్డీవో రవి, అదనపు సీపీ మధుసూదన్ రావు, జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి పద్మావతి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్‌రెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయ శాఖ అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి, కలెక్టర్, అదనపు కలెక్టర్లతో హైకోర్టు న్యాయమూర్తి అతిథి గృహంలో కొద్దిసేపు భేటీ అయ్యారు. అంతకుముందు ఆమె పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు.



హైకోర్టు న్యాయమూర్తికి కలెక్టర్ స్వాగతం

గిరిజన అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

- విద్యాభివృద్ధికి పెద్ద పీట
- 2104 మందికి పోడు భూములు పంపిణీ
- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-నసురుల్లాబాద్

సమైక్య పాలనలో నిరాదరణకు గురై మౌలిక సదుపాయాలకు దూరంగా దుర్భర జీవితాన్ని గడిపిన గిరిజనులు నేడు స్వరాష్ట్రంలో సకల సౌకర్యాలతో దర్జాగా బతుకుతున్నారని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహించిన గిరిజన దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.7కోట్లతో నూతనంగా నిర్మించే గిరిజన బాలుర వసతి గృహం, సిబ్బంది వసతి గృహం నిర్మాణానికి స్పీకర్ పోచారం శంకుస్థాపన చేసి భూమిపూజ చేశారు. బోగ్ బండర్ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పకడ్బందీగా ప్రణాళికలను అమలు చేసి గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, స్వయం పాలనే ధ్యేయంగా తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. గిరిజన, బంజారాల దశాబ్దాల కలలను నిజం చేసిన గొప్ప వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.53,417 కోట్లు ఖర్చు చేసిందన్నారు. 'గతంలో తాండాలు, గిరిజన గూడేలను గ్రామ పంచాయతీలుగా మారుస్తామని హామీఇచ్చినా గత ప్రభుత్వాలు నేరవేర్చలేదని, కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ 3146 తాండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారని గుర్తు చేశారు. గిరిజన రిజర్వేషన్లు 6 శాతం నుంచి 10 శాతానికి పెంచారని తెలిపారు. కళ్యాణలక్ష్మీ పథకం ద్వారా లక్ష 55 వేల మంది గిరిజన యువతులకు రూ.1,306 కోట్ల నగదు సహాయం అందించారని తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలోని 1.50 లక్షల మంది గిరిజన రైతులకు నాలుగు లక్షలకు పైగా ఎకరాల పోడు భూములకు చెందిన పట్టాలు అందుతాయని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని 2,104 మంది గిరిజన రైతులకు 3,830 ఎకరాల పోడు భూములకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. నసురుల్లాబాద్‌లోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో రామారావు మహారాజ్ విగ్రహాన్ని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి స్వంత ఖర్చులతో ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బాన్సువాడ, బోధన్ ఆర్డీఓలు రాజాగౌడ్, రాజేశ్వర్, రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, ఎంపీపీ పాల్త్య విఠల్, మండలాధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, జడ్పీకోఆప్షన్ మెంబర్ మాజీద్, జడ్పీటీసీ జన్నుబాబు, ప్రతాప్‌సింగ్, నాయకులు బద్యానాయక్, మోహన్ నాయక్, తహసీల్దార్ భవయ్య, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, సభ నిర్వాహకులు విజయ భారతి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారులు హాజరయ్యారు.

మిషన్ భగీరథ మెయిన్ లైన్ లీకేజీ

- పట్టించుకోని మిషన్ భగీరథ అధికారులు
- వారం రోజులుగా తాండా వీధులలో నీరు వృథా

నవతెలంగాణ-జుక్కల్



మండలంలోని మహమ్మదాబాద్ తాండాలో మిషన్ భగీరథ మెయిన్ పైప్ లైన్ గత వారం రోజులుగా లీకేజీ కావడంతో నీరు తాండాలోని కాలనీలలో, రోడ్ల వెంట నీరు వెళ్లి నడవ లేని దుస్థితి నెలకొంది. పలు మార్లు మిషన్ భగీరథ అధికారులకు ఫిర్యాదు చేసినా.. సమస్యను పరిష్కరించడం లేదని వాపోతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యలపై దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉందని అంటున్నారు. ఆదివారం మిషన్ భగీరథ దినోత్సవం జరుపుతున్న ప్రభుత్వం సంబంధిత శాఖ మిషన్ భగీరథ పని తీరు ఎలా ఉందో సమీక్షించుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతాలలో లీకేజీల సమస్యలను వెంటవెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నీటి వృథాను అరికట్టే విధంగా చూసుకోవాలని మహమ్మదాబాద్ తాండా వాసులు పేర్కొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి 591 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం రసాయనశాస్త్రప్ర, గణాంక శాస్త్రం ఉదయం మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం రెండవ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. ఉదయం 6388 మంది విద్యార్థులకు గాను 470 మంది గైర్హాజరు కాగా 5,918 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం రెండవ సంవత్సరం విద్యార్థులు 2256 కు 121 విద్యార్థులు గైర్హాజరు కాగా 2135 హాజరయ్యారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి రఘురాజ్ ఆర్మూర్ లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రభుత్వ బాలుర కళాశాల, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, పెర్కిట్లోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల, భీంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను తనిఖీ చేసి సమీక్షించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్‌లు 30పరీక్ష కేంద్రాలను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు 14 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఆర్టీసీలో మహిళ ప్రయాణికులకు టి-9 టికెట్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

టీఎస్ ఆర్టీసి తొలిసారిగా పల్లె వెలుగు బస్సుల్లో మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం టి-9 టికెట్ పథకం ఈనెల 18 నుండి ప్రవేశ పెడుతుందని ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఉషా దేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం రూ. 100 చెల్లిస్తే 60 కిలోమీటర్ల పరిధిలో ఆర్టీసీ బస్సులో రానుపోనూ ప్రయాణించే వెసులుబాటు కలిగిస్తుందని, టి-9 టికెట్ వల్ల ప్రతి ఒక్కరు రూ. 20 నుంచి రూ. 40 వరకు ఆదా చేయవచ్చునని తెలిపారు. . ఈ టి-9 టికెట్ ఉదయం 09 గంటల నుండి సాయంత్రం 06 గంటల వరకు మాత్రమే వర్తిస్తుందని, పల్లె వెలుగు బస్సు కండక్టర్ వద్ద అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. మహిళలు, సీనియర్ సిటిజన్లు టి-9 టికెట్‌ను వినియోగించుకోని సురక్షిత, సుఖవంతమైన ప్రయాణం చేయాలని కోరారు.

నాళేశ్వర్‌లో ఇసుక కాసులు

- వాగు నుంచి పట్టపగలే తరలింపు
- వీడీసీ కనుసన్నల్లో వ్యాపారం
- గ్రామంలో ఇసుక డంపింగ్‌లు
- పగలు డంపింగ్.. రాత్రి లిఫ్టింగ్
- మామూలుగా తీసుకుంటున్న అధికారులు



వాగునుంచి ట్రాక్టర్‌లో నింపుతున్న ఇసుక

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నాళేశ్వర్ వాగు నుండి పట్టపగలే ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను యదేచ్ఛగా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి నాళేశ్వర్ వాగు నుండి ఇసుకను ప్రభుత్వ అనుమతులతో తరలిస్తే వ్యతిరేకించిన నాళేశ్వర్ గ్రామ కమిటీ పెద్దలకు ఇప్పుడు అదే ఇసుక వీడీసీకి కాసుల వర్షం కురిపిస్తుంది. నాళేశ్వర్ గ్రామానికి వెళ్లే దారిలోనే ఇసుక డంపింగ్‌లు స్వాగతం పలుకుతున్నాయి.

విడిసిదే పెత్తనం..

లక్షల్లో ఆదాయం.

నాలేశ్వర్ గ్రామంలో ఇండ్ల నిర్మాణాలకు తరలించుకుంటామని చెబుతూ గ్రామ కమిటీ పెద్దలు ఇసుక దందాను దర్జాగా ప్రోత్సహిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. గ్రామంలో సుమారు 50 నుండి 60 ట్రాక్టర్లు ఉండగా అందులో సగానికి పైగా ట్రాక్టర్ యజమానులు నెలకు 24 వేల చొప్పున వీడీసీకి చెల్లిస్తూ అక్రమ ఇసుక దందాను మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో వీడీసీ నెలకు లక్షల్లో ఆదాయం ఆర్జిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కొన్ని వారాలుగా ఈ తతంగు జరుగుతున్న అధికార యంత్రాంగం మాత్రం ఎందుకు చూసి చూడనట్టు వివరిస్తుందో అర్థం కావడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామంలో వేసిన ఇసుక దంపులు

పట్టపగలు డంపింగ్.. అర్ధరాత్రి లిఫ్టింగ్

నాలేశ్వర్ వాగు నుండి కూలీలతో ట్రాక్టర్లను నింపుకొని గ్రామంలోనే దర్జాగా ఇసుక డంపింగ్ చేస్తు.. అర్ధరాత్రి ట్రాక్టర్, టిప్పర్లతో గ్రామంలో లిఫ్టింగ్ చేస్తూ అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. 450 ఫీట్ల టిప్పర్‌కు డంపింగ్ పాయింట్ వద్ద సుమారు 8000 రూపాయలు ఇసుక వ్యాపారస్తుల వద్ద తీసుకుంటున్నట్లు సమాచారం. డంపింగ్ చేసిన ఇసుకను రాత్రి పూట ట్రాక్టర్, టిప్పర్లలో చుట్టుపక్కల గ్రామాలతోపాటు నవీపేట్, నందిపేట్, మాక్లూర్, నిజామాబాద్, నిర్మల్ జిల్లా బాసర, ముధోల్, బైంసా కాకుండా మహారాష్ట్ర ధర్మబాద్ కు సైతం తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ ఖజానాకు గండి

నాళేశ్వర్ వాగులో నాణ్యమైన ఇసుక లభిస్తుండడంతో గత నెల నుండి పట్టపగలు ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండిపడుతున్నా అధికార యంత్రాంగం మాత్రం "మామూలు"గానే తీసుకుంటున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఫిర్యాదు చేసిన రెవెన్యూ అధికారుల్లో చలనం లేకుండా పోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గ్రామ అభివృద్ధి కమిటీ పేరుతో పర్యావరణ వనరులను నాశనం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రజాసంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. అర్హులైన పేదలు అధికారుల చుట్టూ తిరుగుతున్న కనికరించని రెవెన్యూ యంత్రాంగం అక్రమార్కులకు మాత్రం అండగా ఉండడం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ ఇసుక రవాణాతో భూగర్భ జలాలు తగ్గి భవిష్యత్తు తరాలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టి సారించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టి, వీడిసి పెత్తనాన్ని అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ఇసుకపై వీడీసీ పెత్తనం ఏంటి?



నాయక్ వాడి శ్రీనివాస్,సిపిఎం మండల కార్యదర్శి, నవీపేట్

పర్యావరణ వనరులైన ఇసుకపై గ్రామాభివృద్ధి కమిటీ పెత్తనం ఎందుకు చలాయిస్తుంది. అక్రమంగా ఇసుకను ఇష్టారాజ్యంగా తరలిస్తే భూగర్భ జలాలు తగ్గి భవిష్యత్ తరాలకు నష్టం వాటిల్లుతుంది. వెంటనే మైనింగ్ అధికారులు స్పందించి గ్రామంలోని ఇసుక దంపులను సీజ్ చేసి ప్రభుత్వ ఖజానాకు గండి పడకుండా అడ్డుకట్ట వేయాలి. పాలకవర్గం సైతం అక్రమార్కులకు మద్దతు ఇవ్వకుండా ఉక్కుపాదం మోపాలి.

వర్థంతిలో రైతులందరూ పాల్గొనాలి

నవతెలంగాణ-మోర్తాడ్

భీంగల్ తాలూకా వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపకుడు బద్దం నర్సారెడ్డి 19వ వర్థంతి సభకు తాలూకా స్థాయిలోని రైతులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కిషన్ రెడ్డి, సుంకేట రవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భీంగల్ తాలూకా లోని రైతుల కోసం పోరాడిన బద్దం నర్సారెడ్డి వర్థంతి సభకు ఆయన సతీమణి సునీత నర్సారెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. మోర్తాడ్‌లోని వ్యవసాయదారుల సంఘం వద్ద సభ ఉంటుందని, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యా ,వైజ్ఞానిక, సైదాంతిక శిక్షణ తరగతులు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

రాష్ట్రస్థాయి విద్యా ,వైజ్ఞానిక, సైదాంతిక ,రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. శనివారం రైల్వే స్టేషన్ దగ్గర కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26,27,28 న మల్యాజ్గిరి లో శిక్షణ తరగతులు ఉంటాయని, దేశ, రాష్ట్ర రాజకీయాల పరిస్థితులపై, సమస్యలపై సుదీర్ఘంగా చర్చిస్తారు అని అన్నారు. ఈ శిక్షణ తరగతులకు రాష్ట్రవ్యాప్తంగా 700 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, జిల్లాలోని ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కుషాల్, నిజామాబాద్ నగర సహాయ కార్యదర్శి నవీన్, నాయకులు అరవింద్, బాధర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ



నవతెలంగాణ మోర్తాడ్

మండలం పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్మార్ట్ టీవీని శనివారం సుంకం రాజేశ్వర్ అందజేశారు. రాజేశ్వర్ తల్లిదండ్రులు సుంకం రాములు ఆండలమ్మ జ్ఞాపకార్థం పాఠశాలకు 55 ఇంచుల స్మార్ట్ టీవీని అందజేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులకు ఆన్లైన్ తరగతులతో పాటు ప్రభుత్వం అందిస్తున్న విద్యా బోధనపై అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంధ్రయ్య, పాఠశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు

ఒంటి కాలిపై నిలబడి అధ్యాపకుల నిరసన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ తమను వెంటనే క్రమబద్ధీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం యూనివర్సిటీ లోని ఆర్ట్స్ కళాశాల ఎదుట వంటి కాలుపై నిలుచుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ (గూప్స్) సంఘం జాక్ రాష్ట్ర కో కన్వీనర్ డాక్టర్ దత్తహరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంట్రాక్టు పదం ఉండదన్న ముఖ్యమంత్రి కేసిఆర్ తమను నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దేవరాజు శ్రీనివాస్, డాక్టర్ వి జలంధర్, డాక్టర్ గంగా కిషన్, డాక్టర్ శరత్, డాక్టర్ నాగేశ్వర రావు, డాక్టర్ డానియల్, డాక్టర్ సిఎస్ శ్రీనివాస్, డాక్టర్ స్వామి రావు, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు

అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



బాలామృతాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-కమర్‌పల్లి

అంగన్వాడి కేంద్రాలను గర్భిణీలు బాలింతలు సద్విని యోగం చేసుకోవాలని హస కొత్తూర్ గ్రామ ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్ అన్నారు. శనివారం ఆయన గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న బాలామృతాన్ని, పిల్లలు గర్భిణుల కోసం చేసిన వంటలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించుకొని వారికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని, ఆటలతో కూడిన విద్య విజ్ఞానాన్ని అందించాలని అంగన్వాడి టీచర్లకు సూచించారు. గర్భిణీలు బాలింతలు పాలు, గుడ్డుతో పాటు అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తెలపాలని అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

పది సప్లమెంటరీలో 130 మంది గైర్హాజరు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిజామాబాద్ జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలో గణిత శాస్త్రం పరీక్ష నిర్వహించగా పరీక్షకు 2004 మంది విద్యార్థులకు 1874 మంది విద్యార్థులు హాజరయ్యారు, 130 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డిఇఓ దుర్గా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఈవో 5 పరీక్షా కేంద్రాలను, ఫ్లైయింగ్ స్కార్డ్ 11 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షణ చేశారు.

శరవేగంగా తొర్తి వంతెన నిర్మాణ పనులు

- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఏర్గట్ల

తొర్తి నుండి పాలెం, మోర్తాడ్ వెళ్ళే వంతెన నిర్మాణపనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.ఈ వంతెన నిర్మాణం కాకముందు వర్షాకాలం వచ్చిందటే రోడ్డుపై నుండి నీటి ప్రవాహం ఎక్కువై తొర్తి నుండి పాలెం, మోర్తాడ్ వెళ్లే మార్గం మొత్తం మూసుకుపోయి రవాణా సౌకర్యాలు లేక తొర్తి గ్రామం జలదిగ్బంధంలో ఉండిపోయేది. అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్ రాలేని పరిస్థితుల్లో జబ్బుతో బాధపడుతున్న వారిని అవతలి వైపు దాటించేందుకు తొర్తి గ్రామస్థులు నానా అవస్థలు పడేవారు ఈ విషయాన్ని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి స్థానిక నాయకులు, గ్రామస్తులు తీసుకెళ్ళడంతో స్పందించిన మంత్రి వేముల,వంతెన నిర్మాణ పనుల నిమిత్తం కోటి 40 లక్షల రూపాయలు మంజూరు చేయించడంతో... నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వంతెన నిర్మాణం జరగడంతో ఈ వర్షాకాలం ఎలాంటి బాధ ఉండదని తొర్తి గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై 'నవతెలంగాణ' గ్రామస్తులను పలకరించగా.. వారు మాట్లాడుతూ... మా బాధలు తొలగిపోయాయని, నిర్మాణం చేపడుతున్నందుకు మంత్రి ప్రశాంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.



నిర్మాణం పూర్తికావస్తున్న వంతెన

అంగన్వాడీ జీపు జాతాను జయప్రదం చేయాలి

- జీపు జాత పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-నవీపేట్

అంగన్వాడి జీపు జాతా పోస్టర్లను మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంగన్వాడి యూనియన్ నాయకురాలు శివ రాజమ్మ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులు, టీచర్లు హెల్పర్లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, 45వ ఇండియన్ లేబర్ కౌన్సిల్ సిఫారసు మేరకు 26వేల వేతనాన్ని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. బకాయి పడ్డ టి ఏ, డి ఏ లను వెంటనే చెల్లించాలని, సెంటర్ అద్దెలను సకాలంలో ఇవ్వాలని సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19న అంగన్వాడీల జీపు జాత కార్యక్రమం నిజామాబాద్ పాత కలెక్టర్ ఆఫీస్ కార్యాలయం వద్ద వస్తున్నందున చలో నిజామాబాద్ కార్యక్రమానికి మండలంలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీలో ఉమారాణి రమాదేవి మాధవి కళావతి తదితరులు పాల్గొన్నారు.



జీపుజాతా పోస్టర్లు ఆవిష్కరించిన అంగన్‌వాడీ టీచర్లు

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్ నగర్ గ్రామానికి చెందిన లబ్దిదారుడు వర్దం నరేష్‌కు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కులను శనివారం అందజేశారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కృషితో ప్రభుత్వం రూ.75వేల ఆర్థిక సహాయం చెక్కు మంజూరు కాగా సర్పంచ్ పుప్పాల గంగాధర్, కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాలావత్ ప్రకాష్ చేతుల మీదుగా లబ్దిదారుని ఇంటివద్దా అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గంగం గంగారెడ్డి, నాయకులు జిల్లా రవి, క్యాతం రాజేందర్, రమేష్, మేదరి గంగాధర్, తోట ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పంచాయతీలకు మహర్దశ

- రూ. కోటి 40 లక్షలు నిధులతో శంకుస్థాపనలు
- ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్



పనులకు శంకుస్థాన చేసిన ఎంపీపీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గిరిజన గ్రామ పంచాయతీలకు మహర్దశ ప్రారంభమైందని ఇందల్‌వాయి మండలంలో నూతన గ్రామ పంచాయతీ భవనల నిర్మాణంకోసం ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి రూ. కోటి 40 లక్షలు నిధులను మంజూరు చేశారని ఇందల్‌వాయి ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్ అన్నారు. శనివారం శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. మండలంలోని గండి తండా రంజిత్ నాయక్ తండా, ఇందల్వాయి తాండ గంగారం తండా, జీకేతండా, మెగ్యా నాయక్ తండ, స్టేషన్ తాండ గ్రామాలకు రూ.20 లక్షల చొప్పున నూతన గ్రామపంచాయతీ భవనాలకు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం గిరిజనోత్సవం, సేవాలాల్ భోగ్ బండర్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుసని అంజయ్య, ఎంపిడిఓ రాములు నాయక్ పిఆర్ ఏఈ కిషన్, ఉపసర్పంచ్ సుధాకర్ సుద, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలివేరి దాసు, సర్పంచ్ లు చందర్ నాయక్, మోహన్ నాయక్, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, పులి వసంత సాగర్, ఉపసర్పంచ్ సుధాకర్ సుద,ఎంపీటీసీ లు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే

- ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- ఘనంగా గిరిజన దినోత్సవం, భోగ్‌బండార్ కార్యక్రమాలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

మోపాల్ : తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం మండలంలోని కులాస్ పూర్ తాండా గ్రామంలో గిరిజనోత్సవం భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సేవలాల్ మహారాజ్ మార్గం, జీవితం బంజారాలకు మార్గదర్శకమన్నారు, ఘనంగా గిరిజనోత్సవం, సేవాలాల్ భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరం అన్నారు. మండలంలోని గుడి తండా, వడ్డెర కాలనీ, సింగంపల్లి, బైరాపూర్, రామ్ నగర్ తండా గ్రామాలకు 20 లక్షల చొప్పున నూతన గ్రామపంచాయతీ బిల్డింగ్‌లకు శంకుస్థాపనలు. చేశారు. అలాగే50 లక్షల నిధులతో నూతన గ్రామ పంచాయతీలకు సీసీ రోడ్స్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు చేశారు. కోటి 50 లక్షలు రూపాయలను మండలంలోని తండాలకు మంజూరు చేశారు. సేవాలాల్ మహారాజు జయంతిని అధికారికంగా ప్రకటించిన ఘనత కెసిఆర్‌దిఅని, హైదరాబాద్ నడిబొడ్డున బంజారాహిల్స్‌లో 21 కోట్ల రూపాయలతో బంజారా భవన్ ను కేసీఆర్ నిర్మించారన్నారు.గిరిజన విద్యార్థులుఉన్నతచదువులుచదువుకోవడానికి ఓవర్సీస్ స్కాలర్షిప్ ద్వారా 20 లక్షల రూపాయలు ఆర్థిక సాయంగా అందిస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. కులాస్‌పూర్ తండాలో డబుల్ లైన్ సిసి రోడ్డును నిర్మించారన్నారు. కార్యక్రమంలో జిల్లా యువ నాయకులు జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు ధర్పల్లి జెడ్పిటిసి శ్రీ బాజిరెడ్డి జగన్మోహన్, ఎమ్మార్వో శ్రీలత, ఎంపీడీవో లింగం నాయక్, పంచాయతీరాజ్ ఏఈ స్రవంతి, ఎంపిఓ ఇక్బాల్ , ఆర్ఐ రాజేశ్వరరావు, ఎంపీపీ లత కన్నరాం, జడ్పిటిసి కమల నరేష్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీనివాసరావు గారు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఇందూరు సిద్దార్థ, సిర్పూర్ సర్పంచ్ ముత్యం రెడ్డి, సాయి రెడ్డి, బాడ్సి సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్ రెడ్డి, మోపాల్ సొసైటీ చైర్మన్ ఉమాపతిరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సిరికొండ:మండలంలోని సరిపల్లి తాండ గ్రామపంచాయతీ, జగదాంబ తండా, జంగిలో డి తాండ గ్రామపంచాయతీ తండాలలో భోగ్ బండార్, జగదాంబ దేవి పూజలు ఘనంగా నిర్వహించారు. తండా పెద్దలని పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు వసంత చందర్ నాయక్ పద్మా రవి నాయక్ గ్రామ పెద్దలు తాండవాసులు పాల్గొన్నారు

నిజామాబాద్‌రూరల్:గాంధీనగర్ తండాలో ప్రభుత్వం గిరిజనులకు చేపట్టే కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. జరిగింది. కార్యక్రమంలో జడ్పిటిసి సుమలత గోపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు మీసాల మధుకర్ రావు, వైస్ ఎంపిపి అన్నం సాయులు, గాంధీనగర్ సర్పంచ్ అనూష లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు

మల్కాపూర్ తాండ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ శ్రీ జగదాంబ మాత శ్రీ రామారావు మహారాజ్ మందిరాల్లో భోగ్ బండార్ కార్యక్రమం చేపట్టారు.పూజారి, చైర్మన్, గ్రామ పెద్ద మనుషులు నాయకులకు సన్మానం చేశారు. గ్రామంలో ర్యాలీగా వెళ్లి తెలంగాణలోని అభివృద్ధి పథకాలు, ఎస్సీ ఎస్టీలకు అధికారికంగా పండుగలను జరపడం, ఎస్టీలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించడం, 101 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా అందించడం, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రోత్సహించడం, గురుకుల పాఠశాలలను, గురుకుల జూనియర్ కాలేజీలను, డిగ్రీ కాలేజ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ అనుష ప్రేమ్ నాయక్, సర్పంచ్ హరి చంద్ నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోతీ నాయక్, వార్డు సభ్యులు, మందిరం చైర్మన్ మున్ని నాయక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, మాజీ ఎంపిటిసి గంగారాం నాయక్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రకాష్, గంగా అగ్రోరైస్ మిల్ యజమాని రావుజి నాయక్ పాల్గొన్నారు.



నిజామాబాద్‌రూరల్ : మల్కాపూర్‌లో..



కమ్మర్‌పల్లి : భోగ్‌బండార్‌లో పాల్గొన్న అధికారులు, నాయకులు

కమ్మర్‌పల్లి :మండలంలోని కొత్తచెరువు తండా, దొమ్మరి చౌడు తండా, ఇనాయత్ నగర్ గ్రామాల్లో వన దేవతలకు భోగ్ బండార్ సమర్పించి గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. దొమ్మరి చౌడు తండాలో జరిగిన గిరిజన ఉత్సవాలలో మండల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు గిరిజనులతో కలిసి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లు నునావత్ లస్కర్, గుగులోతు భాస్కర్, లకావత్ చిన్ని, ప్రత్యేక అధికారి రామ్ చందర్, ఎంపీడీవో సంతోష్ రెడ్డి, తహసిల్దార్ సురేష్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ మైలారం గంగాధర్, సెర్ప్ ఏపీఎం కుంట గంగాధర్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాలవత్ ప్రకాష్, మాజీ ఎంపీపీ మాలావత్ కౌసల్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, తండాల పెద్దలు పాల్గొన్నారు.

ఆర్మూర్ :తెలంగాణ గిరిజన ఉత్సవం కార్యక్రమంలో భాగంగా గిరిజన



మోపాల్ మండలంలో..



ముప్కాల్‌లో..

గురుకుల విద్యాలయాల్లో విద్యార్థిని విద్యార్థులకు ఇంగ్లీష్ విద్యనభ్యసిందుకు మండలంలోని ఖానాపూర్ గ్రామంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, సర్పంచ్ సింగిరెడ్డి మోహన్, సెక్రటరీ సౌజన్య గిరిజనులు భోజమ్మ, భూదేవి, గంగా నర్సు, నడుకుడ గంగు, బ్రాహ్మణపల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్:మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నాయకపోడు సంఘంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కొమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కాలంలో (ఎస్టీ) గిరిజనుల కోసం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మ వెంకట్ రెడ్డి, జడ్పీటిసి సభ్యులు బద్దం నర్సవ్వ నర్సారెడ్డి, సర్పంచ్ మారెల్లి విష్ణు, ఎంపీటీసీ సభ్యులు జోషి వెంకట్ రాజ్, ఎంపీడీవో దామోదర్, పంచాయితీ సెక్రటరీ భరత్ స్వరూప్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు శాఖపూర్‌లో మంచినీళ్ల పండుగ

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గణేష్

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 18న ఆదివారం ఉదయం మండలంలోని శాఖపూర్ గ్రామంలో మంచినీళ్ల పండుగ నిర్వహించనున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏఈ గణేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జుక్కల్ శాసన సభ్యులు హన్మంత్ షిండే, జహీరాబాద్ ఎంపీ బి.బి.పాటిల్, కామారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్ దఫేదర్ శోభ రాజు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, బాన్సువాడ డివిజన్ ఆర్డీవో రాజాగౌడ్ హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలో గల ప్రజాప్రతినిధులు, అధికారులు, అనాధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

యోగా శిక్షణకు భారీగా తరలిరండి

- మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ బండివార్ విజయ్

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని గురు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించే యోగా శిక్షణ కార్యక్రమానికి భారీ ఎత్తున జనాలు తరలి రావాలని నిర్వాహకులు మద్నూర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ బండివార్ విజయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నిర్వహించే యోగ శిక్షణ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహిస్తామని దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ ఉదయం 6 గంటలలోపు గురు ఫంక్షన్ హాల్ కు హాజరుకావాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితుడికి చేయూత



బాధితుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-పిట్లం

అగ్ని ప్రమాద బాధితుడికి పలువురు శనివారం చేయూతనందించారు. మండల కేంద్రంలోని ఎస్సీ వాడలో నివాసముంటున్న పడమటి నగేష్ పంచాయతీ కార్మికుడి నివాసపు పూరి గుడిసె ఇటీవల దగ్ధమై కుటుంబ సభ్యులు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. ఈ నేపథ్యంలో లయన్స్ క్లబ్ వారు వంట సామాగ్రి, సరుకులు, బట్టలు, నగదును అందజేశారు. కాగా పంచాయతీ వార్డు మెంబర్ చాటారి బాల్‌రాజ్ 25 కిలోల బియ్యంను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి డాక్టర్ కిషన్, సభ్యులు వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, హబేద్ హుస్సేన్, దన్నారపు సంతోష్, యుసుఫ్, రాజు, జాన్, హరీష్, ప్రవీణ్, సాయిరాం, లాలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న సర్పంచ్ పెంటియా నాయక్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని జగదాంబ తండాలో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణం కోసం శనివారం భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించినట్టు జగదాంబ తండా సర్పంచ్ పెంటియా నాయక్ తెలిపారు. గ్రామ పంచాయతీకి భవనం లేకపోవడం వల్ల ఎల్లారెడ్డి శాసనసభ్యులు సురేందర్ దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించి గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణం కొరకు 20 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారు. దాంతో సర్పంచ్ పెంటియా నాయక్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్దారెడ్డి చేతుల మీదుగా టెంకాయ కొట్టి గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణం కొరకు పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామపంచాయతీ నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు గిరిజనులు గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సర్వం నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి సౌమ్య, కారోబార్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు గంగారం, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ ప్రభుత్వ వైద్యాధికారిని సన్మానించిన జడ్పీటీసీ



సంగీత్ కూమార్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి కాయకల్ప అవార్డు రావడంతో ఆస్పత్రి వైద్యాధికారి సంగీత్ కుమార్‌ను జెడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు, ప్రజాప్రతినిధులు శనివారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్ మాట్లాడుతూ.. దోమకొండ ప్రభుత్వ ఆసుపత్రికి కాయకల్ప అవార్డు రావడం సంతోషమని, ఆసుపత్రిలో రోగులకు మంచి వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు దివ్య, శ్రీవాణి, పద్మావతి, దీక్షిత్, నిఖిల్, ఎంపీటీసీ నిమ్మశంకర్, శమ్మి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేత



పేద విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న చారిటబుల్ సొసైటీ సభ్యులు

నవతెలంగాణ-కోటగిరి

రామకృష్ణ సేవా సమితి కోటగిరి సౌజన్యంతో హెల్ప్ యన్ ఓప్ చారిటబుల్ సొసైటీ, విశాఖపట్నం వారు 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పేదమెరిట్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడంలో భాగంగా శనివారం విద్యార్థులకు ఉచితంగా వారు చదువుకోవడానికి పుస్తకాలను సొసైటీ సెక్రటరీ సాయిరాం వినయ్ శ్రీ వివేకానంద పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయిరాం వినయ్ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాల నుంచి 28 మంది పేద మెరిట్ విద్యార్థులకు ట్యూషన్ ఫీజు, పుస్తకాలను చదువుకు ఆటంకం కలగకుండా అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు గోగినేని శివ శ్రీనివాస్, హనుమంతరావు, శివ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పత్రాల కోసం పరుగులు

- రూ.లక్ష ఆర్థికసాయం కోసం ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు
- కుల, ఆదాయ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాలకు పరుగులు
- అప్లై చేసేందుకు ఆన్‌లైన్ సెంటర్ల వద్ద క్యూ

నవతెలంగాణ-కామారెడ్డి

సీఎం కేసీఆర్ ప్రభుత్వం కులవృత్తులకు రూ.లక్ష ఆర్థికసాయం ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా దరఖాస్తు చేసుకోవాలంటే లబ్ధిదారులు ప్రధానంగా కుల, ఆదాయ ధ్రువపత్రాలు కలిగి ఉండాలి. వాటిని పొందేందుకు లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రూ.లక్ష ఆర్థికసాయం దరఖాస్తుకు 20వరకు గడువు ఉందని ప్రభుత్వం మొదట ప్రకటించినా.. తాజాగా శనివారం ప్రభుత్వం గడువు ఎత్తేసింది. బీసీలకు రూ.లక్ష సాయం అనేది నిరంతర ప్రకియ అని పేర్కొంది. దీంతో లబ్ధిదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా.. కుల, ఆదాయ ధ్రువపత్రాలు పొందడంలో ఇబ్బందులు ఏర్పడటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.



ఆదాయ, కుల ధ్రువపత్రాలకోసం వచ్చిన ప్రజలు



తహసీల్దార్ కార్యాలయం

కుల వృత్తి లోనులకు అర్హులు వీరే...

విశ్వబ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణ, రజక, కుమ్మరి, మేదరి తదితర చేతివృత్తులు, కులవృత్తులను నమ్ముకొని జీవిస్తున్న వారికి రూ.లక్ష వరకు ఆర్థికసాయం అందించాలని ఇటీవల కేబినెట్ సమావేశం నిర్ణయించింది. ఇందుకోసం తగిన విధివిధానాలు రూపొందించి, లబ్ధిదారులను ఎంపిక చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. వెనుకబడిన వర్గాల కులవృత్తులు, చేతివృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది.

కావలసిన పత్రాలు..

ఫోటో, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం వివరాలతో సరళంగా అప్లికేషన్ ఫారాన్ని జిల్లా యంత్రాంగం పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. చేతి వృత్తిదారుల జీవితాలలో వెలుగులు నింపి, వారి ఆర్థిక భరోసాను అందించడంతో పాటు గౌరవప్రదమైన జీవనం కొనసాగించేందుకు సీఎం కేసీఆర్ నిరంతరం తపన పడుతుంటారని, ఈ పథకం ద్వారా వారి జీవితాల్లో ఆర్థిక స్వావలం బనకు అవకాశం ఏర్పడుతుందని, లబ్ధిదారులు వృత్తి పనిముట్లు, ముడిస రుకు కొనడానికి ఈ నిధులు ఉపయో గపడుతాయి. కుల, ఆదాయం సర్టిఫికేట్, ఆధార్‌కార్డు, ఫోటో, బ్యాం కు ఖాతా జిరాక్స్, పాన్ కార్డులను జత చేయాలి.

మీ సేవా, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు..

ఈ నెల 20 వరకే గడువు ఉండటంతో లబ్ధిదారులు మీ సేవల చుట్టూ, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎక్కడ చూసినా జనం గుమిగూడుతున్నారు. అలాగే ఈ నెల 20 వరకు దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అధికారులు కూడ సరైన సమయానికి ఉండకపోవడం, ఉత్సవాలలో తిరగడం కూడా దీనికి తోడైంది. కావున ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూసి ఈ నెల 20 వరకు ఉన్న గడువును మరింత పొడగించి, లబ్ధిదారులకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

తండాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- పలు గ్రామాల్లో ఘనంగా గిరిజనదినోత్సవం

నవతెలంగాణ-విలేకరుల బృందం

పిట్లం : తండాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. శనివారం మండలంలోని గౌరారం తండాలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నియోజకవర్గం గిరిజనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పిమ్మట రాష్ట్రంలోని 500 జనాభా కలిగిన తాండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. తండాలకు కోట్లాది రూపాయలతో డాంబర్ (తారు) రోడ్లు పునరుద్ధరించామని అన్నారు. తాండ పంచాయతీలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తూ సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలు చేపట్టినట్టు తెలిపారు. సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ప్రభుత్వ అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో సాయగౌడ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండలంలోని మధురాతాండా జీపీలో గిరిజన దశాబ్ది ఉత్సవాలను సర్పంచ్ సంజీవ్ చౌహాన్ అధ్యక్షతన స్థానిక బీఆర్ఎస్ మండల స్థాయి ప్రజాప్రతినిధులతో కలిసి తాండా వాసులు శనివారం ఘణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన అరాధ్యదైవం సేవాలాల్, కొమురం భీమ్ చిత్రపటాలకు పూలమాల వేసి ఉత్సవాలను సర్పంచ్ సంజీవ్ ప్రారంభించారు. ముఖ్య అతిథిలుగా విండో చైర్మేన్ శివానంద్ పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రం గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా కోట్లాది రూపాయలను వెచ్చించిందని, విద్యనందించేందుకు ప్రత్యేకంగా వసతిగృహాలు ఏర్పాటు చేసి విద్యనందిస్తోందని తెలిపారు. అనంతరం గిరిజన మహిళలు ఆట పాటలతో తాండాలో సంబురాలు చేసారు. పిల్లలు ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్ లక్ష్మన్, విండో చైర్మెన్ శివానంద్, మాజీ ఎంపీపీ శెట్కార్ బస్వంత్ రావ్ పటేల్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాదారావ్ దేశాయి, మాజీ అధ్యక్షుడు నీలుపటేల్, తాండాపెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



జుక్కల్‌లో దశాబ్ది ఉత్సవాలను సర్పంచ్ సంజీవ్ చౌహాన్



పిట్లంలో మాట్లాడుతూన్నఎమ్మెల్యే హన్మంత్ షిండే



మద్నూర్‌లో..

గోజేగావ్ గ్రామంలో గిరిజన దినోత్సవం..

మద్నూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మద్నూర్ మండలంలోని గోజేగావ్ గ్రామంలో గిరిజన దినోత్సవం నిర్వహించారు. ఆ గ్రామంలో సర్పంచ్ అనిత ఇరువంత్ దేశ్ముఖ్ ఆధ్వర్యంలో గిరిజన నాయకుడు మాజీ మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, ప్రస్తుత సింగిల్ విండో డైరెక్టర్ శివాజీ రాథోడ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు సురేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బన్సీ పటేల్, ఆ గ్రామ అంగన్వాడీ టీచర్, ఆశా వర్కర్ విద్యార్థిని విద్యార్థులు గిరిజన గురువు రామారావు చిత్రపటానికి (నివాళులర్పించారు.

సదాశివనగర్ : మండలంలోని ఉమ్మడి యాచారం గ్రామ పంచాయతీ పరిధిలో ఘనంగా గిరిజనోత్సం నిర్వహించారు. యాచారం పంచాయతీ నుంచి జగదాంబా సేవాలాల్ ఆలయం వరకు గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజనులు బోగ్ బండార్‌ను నిర్వహించారు. అనంతరం గిరిజన నృత్యాలు నిర్వహించారు. పలువురికి సన్మానించారు. సంతోష్ నాయక్, మంగ్యానాయక్, కార్యదర్శి నాగరాజు, సర్పంచ్ లత, ఎంపిటిసి సవిత, ఉపసర్పంచ్ సంగిలీ, పూజరి రమేశ్‌కు సన్మానించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. 110 మందికి పోడు భూముల పట్టాలను ఈ నెల 24 నుంచి పంపిణీ చేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో తండా పెద్ద రమేష్ నాయక్, మంగ్యానాయక్, దేవిసింగ్, గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండలంలోని ఆయా గిరిజన తండాల్లో దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భోగి బండర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజనులకు చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. తాండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లతా రాందాస్, బన్నీ సక్రు, దేశీయ నాయక్, రవీందర్ నాయక్, గోవింద్, పరశురాం, పీర్‌సింగ్, ఎంపీటీసీ రూప్‌సింగ్, ఘనునాయక్ గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలి



ధర్నా చేస్తూన్న ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోటగిరి ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎమ్మార్వోకు శనివారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి చక్రపాణి, మండల నాయకులు ఏ విటల్‌గౌడ్, భూమయ్య, సుశీల, ఉషారాణి, గంగవ్వ, కృష్ణవేణి, శేషభాయి, సత్యమ్మ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను నిర్వహిస్తూన్న అటవీ శాఖ అధికారులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు అటవీ శాఖ వారి ఆధ్వర్యంలో శనివారం డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్టు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఓంకార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల భాగంగా ఈ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. సోమవారం హరిత దినోత్సవం పురస్కరించుకొని బంజారా తాండ వద్ద మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు, అదే రోజున పోటీ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు.

షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రఫీక, షమీం బేగమ్, జుబేదాలకు ఈ చెక్కులను అందజేసినట్టు ఆయన పేర్కొన్నారు. షాదీ ముబారక్ చెక్కులకు సహకరించిన సీఎం కేసీఆర్, బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ ఆమీర్, ఎమ్మెల్సీ కవితకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజేందర్‌రావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజలకు మరిన్ని సేవలు అందించాలి

నవతెలంగాణ-దోమకొండ

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ అన్యోన్యకు ఎస్పీగా పదోన్నతి రావడంతో దోమకొండ మండల కేంద్రానికి చెందిన జాతీయ మానవ హక్కులు చైల్డ్ రైట్స్ స్టేట్ డైరెక్టర్ దాస్ ఎల్లం శనివారం శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో, అడిషినల్ ఎస్పీగా గత 4 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో కరోనా లాంటి విపత్తులో ప్రజలకు సేవలు అందించారని, పోలీస్ శాఖపై స్థాయి అధికారులు ఆయన సేవలు గుర్తించి ఎస్పీగా పదోన్నతి రావడంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దోమకొండ అనాథ ఆశ్రమ నిర్వహకులు సంపత్, పోలీస్ శాఖ సిబ్బంది వజీజ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీని సన్మానిస్తున్న దాస్ ఎల్లం

కల్తీ విత్తనాలు, పురుగుల మందులను అరికట్టాలి

నవతెలంగాణ-రెంజల్

రాష్ట్రంలో కల్తీ విత్తనాలు పురుగుల మందులను అరికట్టాలని సిపిఐఎంఎల్ ప్రజాపంథా డిమాండ్ చేసింది. తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించి తహసీల్దార్ రామచందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళారి వ్యాపారులే గ్రామాల్లో నకిలీ విత్తనాలు అప్పగించి ఒప్పందాలు చేసుకున్నారని వారన్నారు. ఉన్నతాధికారులకు చిత్తశుద్ధి లేదని దాడులు చేస్తున్న ఆ తర్వాత మామూలే నాలుగు రోజులు ఆర్భాటం తప్ప తర్వాత కార్పొరేట్ల పక్షం నిలుస్తున్నారని వారు ఆరోపించారు. ఖరీఫ్ సీజన్లో కౌలు రైతులతో సహా రైతాంగానికి వడ్డీలేని రుణాలను, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, పరికరాలు ఉచితంగా సకాలంలో అందించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణ సౌకర్యం సబ్సిడీలు ఒక హక్కుగా ప్రభుత్వం గుర్తించాలన్నారు. రాష్ట్రంలో రుణ మాఫీని ఒకేసారి చేయాలి వడ్డీ లేని కొత్త రుణాలను ఇవ్వాలి, పోడుసాగుదారులందరికీ హక్కులు కల్పించి రైతుబంధు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పుట్టి నడిపి నాగన్న, రాజేశ్వర్, ఎస్కే నశీర్, ఎల్ గంగాధర్, వడ్డెన్న, పోశెట్టి, మోహన్, తరుణ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న పలువురు సిపిఐఎంఎల్ నాయకులు

ఎంఐఎం కౌన్సిలర్లపై హత్యాయత్నం కేసు నమోదు

- రిమాండ్‌కు తరలింపు
- మారణాయుధాలతో హత్యాయత్నానికి వచ్చారంటూ బోధన్ ఎమ్మెల్యే ఫిర్యాదు
- బోధన్‌లో ఎంఐఎం వర్సెస్ బీఆర్ఎస్

నవతెలంగాణ-బోధన్

పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బోధన్ పట్టణంలో దారుల్ ఉలుం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే షకీల్ అమీర్‌కు ఎంఐఎం నాయకులు, కౌన్సిలర్లు అడ్డుకుని బోధన్ పట్టణంలో అభివృద్ధి పనులు జరగలేదని పేర్కొంటూ వాగ్వివాదానికి దిగడంతో ఎంఐఎం నాయకులపై, కార్యకర్తలపై ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ పోలీసుకు ఫిర్యాదు చేశారు. తనపై ఎంఐఎం కౌన్సిలర్లు అల్తాఫ్, నవీద్ మరో 8 మంది నాయకులు మారణాయుధాలతో హత్యయత్నానికి పాల్పడడానికి వచ్చారని పేర్కొంటూ ఎమ్మెల్యే బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై హత్యాయత్నం కింద కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. కాగా వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

బోధన్‌లో రాజుకున్న రాజకీయ వేడి..

త్వరలో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ఎంఐఎం కౌన్సిలర్లు హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ ఫిర్యాదు చేయడం, ఎంఐఎం కౌన్సిలర్లు అరెస్టు కావడం బోధన్‌లో రాజకీయ వేడి రగిలినట్లయింది. పట్టణంలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేను నిలదీస్తే తమపై అకారణంగా కేసులు నమోదు చేయించారని ఎంఐఎం నాయకులు అంటున్నారు. ఇలాంటి కేసులో భయపడమని వారు పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్యేపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజుల క్రితం ఫ్లెక్సీల వార్ జరగడం, ప్రస్తుతం ఎమ్మెల్యేపై హత్యాయత్నం, ఎంఐఎం నాయకులు అరెస్ట్ కావడం బోధన్‌లో ఈ ఘటన హాట్‌టాఫిక్‌గా మారింది.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన బసంత్ రెడ్డి తండ్రి జానకంపెట్ గంగారాం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకుని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, టీపీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్ లు శనివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.. కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి భాస్కర్ రెడ్డి, రమేష్, మండల అధ్యక్షుడు బాకారం రవి, భూషణ్ రెడ్డి, సుభాష్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి,రవి,ఉమర్,రఫిక్, శ్రీహరి రెడ్డి, రాజారెడ్డి, సంపత్ రెడ్డి, నారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఏషియన్ బెస్టు షార్ట్ స్టాపు ప్లేయర్‌గా జిల్లా క్రీడాకారిణి సౌమ్య రాణి

నవతెలంగాణ-ఆర్మూర్


ఈనెల 13 నుండి 17 వరకు తైవాన్ దేశంలోని తైపిలో పులి ప్రాంతంలో జరిగిన ఏషియన్ సబ్ జూనియర్ (అండర్ -15) ఉమెన్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలలో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఇండియా టీంలో సుంకపాక సౌమ్య రాణి (కెప్టెన్), ప్రత్యేక అవార్డును అందుకున్నారు. గుగులోత్ సౌందర్య దాసరి సరియు, గోక శ్రావిక గోక సాత్విక పాల్గొన్నారు. ఈ ఛాంపియన్షిప్ లో సుంకపాక సౌమ్యరాని భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూనే ఏషియన్ ఛాంపియన్షిప్లో బెస్ట్ షార్ట్ స్టాప్ ప్లేయర్గా ప్రత్యేక అవార్డుని అందుకున్నట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి. ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ శనివారం తెలిపారు.ఈ సందర్భంగా సుంకపాక సౌమ్య రాణిని పలువురు అభినందించారు.

తొలిఅడుగు నుంచి తోడు నాన్న

- పిల్లల అభిరుచులకు అనుగుణంగా మారుతున్న ఫాదర్స్
- నేడు ఇంటర్నేషనల్ ఫాదర్స్ డే

నవతెలంగాణ-ఆర్మూర్

నాన్న.. కుటుంబానికి అండగా.. పిల్లలకు మార్గదర్శకుడిగా ఉంటారు. ప్రతి జూన్ లో మూడవ ఆదివారం ఫాదర్స్‌డేగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నవ తెలంగాణ ప్రత్యేక కథనం.



తండ్రి స్ఫూర్తితో.....

వేలు పట్టి నడిపించేది. తానే జీవితానికి వెలుగులు పంచేది. తానే తొలి అడుగు నుంచి తోడుగా నిలిచేది. ఆలనా పాలన నుంచి అన్ని బాధ్యతలు చూసేది ఆయనే నాన్న... అమ్మ కడుపులో పెట్టుకుంటే, అతడు గుండెల్లో పెట్టుకుంటాడు. అమ్మ అనురాగం చూపితే నాన్న మమకారం పంచుతాడు. బిడ్డల బాగు కోసం సర్వస్వం త్యాగం చేస్తాడు. పిల్లల భవిష్యత్తు కోసం జీవితాన్నే ధారపోస్తాడు. కొవ్వొత్తిలా కరుగుతూ పిల్లల ఎదుగుదలకు వెలుగుల బాట వేస్తాడు. అందుకే నాన్నంటే నడిచే దైవం పిల్లల అభివృద్ధిలో నాన్న పాత్ర ఎంతో కీలకమైంది. తండ్రి స్ఫూర్తితో ఆయన చూపిన బాటలో నడిచి ఎందరో ఉన్నత స్థానానికి ఎదిగారు. కన్న వారి కలల్ని సాకారం చేశారు.. పేగు అమ్మదైతే పేరు నాన్నది. అమ్మ ఒడి, గుడి అయితే నాన్న భుజం. లోకాన్ని చూపే బడి.. కుటుంబ వ్యవస్థలో తండ్రి స్థానం విశిష్టమైనది. ప్రాచీన కాలం నుంచి నేటి ఆధునిక సమాజం వరకు తండ్రి కుటుంబ పోషకుడే కాదు. రక్షకుడు కూడా...

బాల్యంలో విడదీయరాని బంధం

బాల్య దశలో తండ్రికి పిల్లలతో విడదీయరాని బంధం ఉంటుంది. పిల్లలతో ఆడుకుంటూ వారితో అక్షరాలు దిద్దిస్తూ ఆనందిస్తారు.. తప్పు చేసినప్పుడు దండించడం కన్నా మంచి చేసినప్పుడు గుర్తించి మెచ్చుకొని ప్రోత్సహిస్తే ఆ బిడ్డకు తండ్రితో అనుబంధం మరింత పెరుగుతుందని మానసిక నిపుణులు చెబుతారు. పిల్లలకు ప్రేమ ఆప్యాయతలను ఇవ్వడం పుచ్చుకోవడం నేర్పించాలని వారంటారు.. పిల్లలను నియంత్రించే ప్రయత్నం చేయడంవల్ల తండ్రి దేన్ని నియంత్రిస్తారో దాన్నే వారు ఇష్టపడతారు. అందుకే వారికి ఏది మంచో ఏది చెడు అర్థం చేయించే ప్రయత్నం చేయాలి. ఏదో ఒక సందర్భంలో పిల్లల ప్రవర్తన ఇబ్బందిని కోపాన్ని తెప్పిస్తుంటాయి. ఇలాంటి సందర్భంలో కోపాన్ని విసుగును తగ్గించుకొని పిల్లల మనసును అర్థం చేసుకోవాలి.. నిదానంగా మాట్లాడితే అర్థం చేసుకుంటారు.. ఒత్తిడి ఒడిదొడుకుల కౌమారంలో మనసులో ఉంచుకోలేక, బయట పడలేక సతమతమయ్యే పరిస్థితి... అనేక సందేహాలు. సంశయాలు.. కౌమార దశలో ఎదురయ్యే పరిస్థితి. ఈ దశలో మానసికంగా ఉత్సాహపరిచి ప్రోత్సహించటం అత్యంత అవసరం. సినిమాలు షికార్లు, చెడు వ్యసనాలు దరికి రానీయకుండా వారిని ఓ కంట కనిపెట్టుకొని ఉండాలి. కెరీర్‌పై అవగాహన కల్పించి దారి చూపాలి. ఈ వయసులో కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగిన వారి గురించి చెప్పడం ద్వారా తాము కూడా అలా ఎందుకు కాకూడదనే భావన వారిలో కలిగించిన వారవుతారు..

నాన్న మారుతున్నాడు...

ఆధునిక సమాజంలో పిల్లలు కొత్త కొత్త విషయాలను నేర్చుకుంటున్నారు.. పిల్లల అభిరుచులకు అనుగుణంగా వారికి కావలసిన సమాచారాన్ని విజ్ఞానాన్ని అందించడానికి ప్రయత్నిస్తున్నాడు.. ఇప్పటివరకు కంప్యూటర్,, స్మార్ట్ ఫోన్,, ట్యాబ్ అంటే తెలియని తండ్రులు ఎందరో ఇప్పుడు పిల్లల కోసం వాటిని వాడుతున్నారు.. పిల్లల సంతోషం కోసం తన అలవాట్లను కూడా మార్చుకొని ముందుకు సాగుతున్నాడు..

... పిల్లల కోసం సమయం..

చాలామంది తండ్రులు పిల్లల కోసం ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు.. ఉదయం వారిని నిద్ర నుంచి లేపి హెూంవర్క్ చేయించడం,, కాల కృత్యాలకు తీసుకెళ్లడం,, స్నానం చేయించడం, అల్పాహారం తినిపించడం కోసం పరుగులు పెడుతున్నారు. బడిలో వదిలి వెళ్లడం, మధ్యాహ్నం స్కూలుకి వెళ్లి భోజనం తినిపించి వచ్చే తండ్రులు ఎందరో ఉన్నారు.. సాయంత్రం బడి ముగియగానే ఎంత దూరంలో ఉన్న పిల్లల్ని ఇంటికి చేరుస్తాడు. పిల్లల హెూంవర్క్ నుంచి రాత్రి పడుకోబెట్టి దాకా బాధ్యతలు నెరవేర్చే తండ్రులు చాలామంది ఉన్నారు.

పిల్లల కోసమే నేర్చుకుంటున్నారు...

చాలామంది తండ్రులు పిల్లల కోసం చాలా విషయాల్లో తర్ఫీదు పొందుతున్నారు. ముఖ్యంగా కంప్యూటర్ ఆపరేటింగ్ నుంచి ఇంటర్నెట్ దాకా నేర్చుకుంటున్నారు. పిల్లల అవసరాల కోసం ఇంటర్నెట్ నుండి డౌన్లోడ్లు చేసి ప్రింట్లు ఇవ్వడం ఈ రోజుల్లో చాలా అవసరం ఉంది. కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో రకరకాల హెూంవర్క్ అప్పగిస్తున్నందున వాటికోసం కంప్యూటర్ వాడకం తప్పనిసరి అయింది. అలాగే పిల్లల కోసం రకరకాల ఆటలు నేర్చుకుంటున్నారు పిల్లల కోసం ఈత నేర్చుకున్న తండ్రులందరూ ఉన్నారు

రోల్ మోడల్‌గా ఉండాలి..



తండ్రి అంటే పిల్లలకు రోల్ మోడల్‌గా ఉండాలి. ప్రతి తండ్రికి ఒక బాధ్యత ఉంటుంది. బయట ఎన్ని కష్టాలు పడిన అవి ఇంట్లో ఎవరికి తెలియకుండా ఇంటిల్లిపాదిని సంతోషంగా ఉంచాలి. పిల్లల మనోభావాలు, ఇష్ట కష్టాలను మనస్తత్వాన్ని గుర్తించాలి. పిల్లలను క్రమశిక్షణలో ఉంచి చదివిస్తే వారి భవిష్యత్తు ఎంతో ఉన్నతంగా ఉంటుంది.

పైడి రాకేష్ రెడ్డి, పారిశ్రామికవేత్త, బిజెపి నాయకులు, అంకాపూర్

ప్రయోజకులయ్యే దాకా వెన్నంటే...



ఒడిదొడుకులు ఎదురైనా మానసికంగా ఆరోగ్యపరంగా సమస్యలు వచ్చిన చెదిరిపోని ధృడత్వాన్ని పిల్లలకు తండ్రి వివరిస్తూ ఉండాలి. తన జీవితంలో ఎదుర్కొన్న అనుభవాలను సమస్యలను ఎలా అధిగమించి బయట పడ్డాడు వివరిస్తూ సమస్యను చిన్నదిగా చూపే ప్రయత్నం చేయాలి. ప్రయోజకులు అయ్యేదాకా వెన్నంటే ఉండే నాన్న ది ఏమి ఆశించని గొప్ప మనసు..

సురేష్ రెడ్డి, అంకాపూర్.

పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు అవగాహన



నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి. వైజయంతి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. లక్ష్మి నర్సయ్య, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో భారత సాక్ష్యాధారాలు సెక్షన్ 25, 27, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 65 బి సర్టిఫికేట్ ప్రాధాన్యత గురించి వివరించారు. నేరస్తులకు శిక్ష పడేటట్లు నూతన సుప్రీంకోర్టు తీర్పులు సేకరించి దాఖలు చేయాలని తెలిపారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పి. రవిరాజ్, రాజ్ గోపాల్ గౌడ్, కవితారెడ్డి, ఆవారి రమేష్, నంద రమేష్, కే. శేషు, నిమ్మ దామోదర్ రెడ్డి, డాక్టర్ సమ్మయ్య, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు యం.డి. రహిమోద్దీన్, భూసారపు రాజేష్ గౌడ్, అశోక్ శివరాం నాయక్, చిదిరాల రాణి, వీరయ్య, పోరిక రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని మైలారం గ్రామంలో శనివారం ఎంపిపి మాలవత్ సంగీతారాజేందర్ ఎంపిపి నిధులనుండి గోసంగి వాడలో బోరు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం, రురల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో మండలంలో ప్రతి మారుమూల గ్రామం అభివృద్ధి చేశారని ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గాండ్ల రమ్యసత్యానంద్, ఎంపీటీసీ గాండ్ల సతీష్ పటేల్, మాజీ సొసైటీ చైర్మెన్ ఇజాప గోపాల్, రామడుగు సర్పంచ్ చిన్నారెడ్డి, సొసైటీ డైరెక్టర్ శ్రీమంతుల రాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రెండోసారి మర్కజ్ కమిటీ అధ్యక్షునిగా మొహినుద్దీన్



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ మార్కాజ్ కమిటీ అధ్యక్షునిగా రెండవసారి మమ్మద్ మొహీనుద్దిన్ శనివారం గెలుపొందడం జరిగింది.. ఎన్నికలలో మొత్తం 2019 ఓట్లు కాగా అందులో మోహినుద్దీన్ కు 1057 రాగా, సమీప ప్రత్యర్థికి 340 వచ్చాయి. 715 ఓట్ల అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. ఉపాధ్యక్షునిగా అతిక్, సెక్రటరీగా అబ్దుల్ రెహమాన్, జాయింట్ సెక్రటరీగా రిజ్వాన్, క్యాషియర్‌గా సాజీదు గెలుపొందారు.

కేజీబీవీలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీ) లోని స్పెషల్ ఆఫీసర్(ఎస్ఓ), పిజిసిఆర్టి, సిఆర్టి, పిఈటి, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల (యుఆర్ఎస్) లోని స్పెషల్ ఆఫీసర్, సిఆర్టిల ఖాళీలను తాత్కాలిక కాంటాక్ట్ పద్ధతిలో భర్తీకై అర్హత, అసక్తి కలిగిన అభ్యర్థుల నుండి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, డెరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు డిఇఓ దుర్గా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లోని ఖాళీల భర్తీకి కేవలం మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. విద్యార్హతలు, రాత పరీక్ష విధానం, రాత పరీక్ష సిలబస్ అభ్యర్థుల ఎంపిక విధానం తదితర వివరాలు నోటిఫికేషన్ వెబ్ సైట్ https://schooledu.telangana.gov.in లో ఈనెల 17 నుండి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులు, ఖాళీలు, ఇతర వివరాలను వెబ్ సైట్ లోనే ఈనెల 25 నుండి అందుబాటులో ఉంటాయని, దరఖాస్తులను వైబ్ సైట్ లోనే 26 నుంచి జూలై 05 వరకు ఉంచాలని తెలిపారు. రాత పరీక్షలు జూలై మాసములో ఎంపిక చేయబడిన పరీక్ష కేంద్రాల్లో ఆన్లైన్ పద్ధతిలో అబ్జెక్టివ్ విధానంలో నిర్వహించబడును అని వివరించారు.

సీఐని అభినందించిన ఇంచార్జీ సీపీ



సీఐలుగా ప్రమోషన్ వచ్చిన వారిని అభినందిస్తున్న ఇన్‌ఛార్జి సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐలకు సీఐగా ప్రమోషన్ వచ్చిన సందర్భంగా నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ నిర్మల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ శనివారం అభినందించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో 2011 బ్యాచ్ కు చెందిన శివరామ్ - సిసిఆర్‌వి, ఎన్ఎస్. ప్రసాద్-సిఎస్‌బి, అంజనేయులు - సి ఎస్.వి, రాజారెడ్డి - నవిపేట్, శ్రావణ్ కుమార్ - టౌన్ 3లకు సిఐ గా ప్రమోషన్ పొందిన సందర్భంగా పోలీస్ కార్యాల యంలో ఇంచార్జీ పోలీస్ కమీషనర్ సి.హెచ్. ప్రవీణ్ కుమార్‌ను పుష్పగుచ్చాలు ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఐటీ హబ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నిజామాబాద్‌నగరంలోని ఐటీ హబ్ పనులను అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బి గాల మాట్లాడుతూ..ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ రంగాన్ని విస్తరించి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని నిజామాబాద్ నగరంలో ఐటి హబ్‌ని నిర్మిస్తున్నామని తెలిపారు. సకల వసతులతో విశాలమైన వాతావరణంలో సమీకృత కలెక్టర్ కార్యాలయానికి చేరువలో నిర్మించిన ఐటీ హబ్ ప్రారంభానికి సిద్ధమైంది. నిజామాబాద్ ఐటీ హబ్‌లో 765 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానుండగా పరోక్షంగా నాలుగు రెట్లు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు.ఐటీ అంటేనే హైదరాబాద్, పూణే, బెంగళూరు నగరాలు గుర్తుకు రాకుండా సకల వసతులతో ఐటీ హబ్ నిర్మించామని తెలిపారు. త్వరలోనే ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఐటీ హబ్‌ను పారంభిస్తారని చెప్పారు.

ప్రొఫెసర్ హరగోపాల్‌పై కేసులను రద్దుచేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రొఫెసర్ హరగోపాల్, తదితర మేధావులు, ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన ఉపా, కుట్ర కేసులను రద్దు చేయాలని సిపిఐ (ఎంఎల్) రామచంద్రన్ పార్టీ ఉత్తర తెలంగాణ కార్యదర్శి ఎస్ సుధాకర్, జిల్లా కార్యదర్శి పోగుల నగేష్ గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై, ప్రజా సమస్యలపై తమ గళాలతో, కలాలతో, ప్రజా పోరాటాలతో ప్రశ్నిస్తున్న, నిరసిస్తున్న మేధావులు, ప్రజా ఉద్యమకారులు, ప్రజాసంఘాల నాయకులు అయినా ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ పద్మజషా, బొంబాయి హైకోర్టు దివంగత జడ్జి హెచ్.సురేష్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నారాయణ, అడ్వకేట్స్ చిక్కుడు ప్రభాకర్, రఘునాథ్, పిఓడబ్ల్యు జాతీయ కన్వీనర్ వి.సంధ్య, అరుణోదయ విమల, అడ్వకేట్ వేముల అనుదీప్, మరో 142 మందిపై కుట్ర, ఉపా తదితర కేసుల కింద తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో బనాయించిన తప్పుడు కేసును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించు కోవాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, ప్రజా ఉద్యమాలలో నిరంతరం పనిచేస్తున్న నాయకులపై, మేధావులపై ఇలా తప్పుడు కేసులు బనాయించి అణిచివేయాలనుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, నిరంకుశ విధానాలకు నిదర్శనమని తెలిపారు. ఇలాంటి విధానాలు మానుకొని, ప్రజల హక్కులు, స్వేచ్ఛకు భంగం కలగకుండా కక్షపూరిత వైఖరి మానుకోవాలనీ, అణిచివేతల ద్వారా, కేసుల ద్వారా పాలన కొనసాగించాలనుకోవడం మంచి పద్ధతి కాదని తెలిపారు. దాని ద్వారా ప్రజల్లో ప్రభుత్వాలు పలుచన అవుతాయి తప్ప మరొకటి కాదన్నారు. కుట్ర, ఉపా కేసులను ఉపసంహరించుకోవాలని లేకుంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రాబోవు రోజుల్లో తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనాల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని దొమ్మరి చౌడు తండా, కొత్తచెరువు తండా గిరిజన గ్రామాల్లో నూతన గ్రామ పంచాయితీ భవనాల నిర్మాణానికి శనివారం సర్పంచ్ లు గుగులోత్ భాస్కర్ నాయక్, లకావత్ చిన్ని భూమి పూజ చేశారు. రూ.20 లక్షలతో ఒక్కో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి, గిరిజనులకు సుపరిపాలన అందిచిన ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ సురేష్, ఎంపీడీవో సంతోష్ రెడ్డి, ఇంచార్జి మండల పంచాయతీ అధికారి మైలారం గంగాధర్, ఏపీఎం కుంట గంగారెడ్డి, ఈజీఎస్ ఏపిఓ విద్యానంద్, ప్రత్యేక అధికారి రామచందర్, పంచాయతీరాజ్ ఏఈ రాగ సుధా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాలేరు శేఖర్, ఎంపీటీసీ సభ్యురాలు బుసాపురం సుప్రియ నవీన్ యాదవ్, ఏఎంసి మాజీ చైర్మన్ ప్రకాష్ నాయక్, డీసీ తండా ఉప సర్పంచ్ కసంలాల్, నర్సాపూర్ సర్పంచ్ పెండ ప్రభాకర్, అమీర్ నగర్ సర్పంచ్ పుప్పాల గంగాధర్, ఇనాయత్ నగర్ సర్పంచ్ సునావత్ లస్కర్ నాయక్, కోనాపూర్ సర్పంచ్ దయ్య దేవయ్య ఎంపిటిసి లకావత్ గంగాధర్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధి

సిసీ డ్రైనేజ్, రహదారి పనులు ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దపల్లి గ్రామంలో 15వ ఫైనాన్స్ నిధుల నుండి గ్రామంలోని 7వ వార్డులో సిసి, రహదారి, డ్రైనేజ్ నిర్మాణ పనులను శనివారం సర్పంచ్ పానుగంటి రూపా సతీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేయడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. పనులు నాణ్యత ప్రమాణాలతో పనులు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించి చేయిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎంబడి సంతోషం, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి నరహరి, భూమయ్య, సాయిలు, బాపురావు, పంచాయతీ కార్యదర్శి నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభించిన సర్పంచ్

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు ఎంఏ, ఎంఎస్సి ఎంఈడీ అర్హత గల ఓపెన్ మార్కెట్ ఫ్రెష్ , రిటైర్డ్ ఉపాధ్యాయుల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డిఈఓ ఎన్వి దుర్గా ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 లోగా పూర్తిచేసిన దరఖాస్తులు ప్రభుత్వ డైట్ కళాశాల నిజామాబాద్‌లో సమర్పించాలని, అభ్యర్థుల ఎంపిక మెరిట్, ఇంటర్వ్యూ, డెమో అధారంగా ఉంటుందని పేర్కొన్నారు. నెలకు 18వేల రూపాయలు, వ్యాయామ విద్య, కళా విద్య పోస్టులకు 12వేల రూపాయల గౌరవ వేతనం ఇస్తారని తెలిపారు. డైట్ కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం లలో ఫిలాసఫీ, సోషియాలజి-1, సైకాలజి-1, సామాన్య శాస్త్ర బోధన పద్ధతులు-1 గణిత శాస్త్ర బోధన పద్ధతులు-2, సాంఘిక శాస్త్ర బోధన పద్ధతులు-1, తెలుగు బోధన పద్ధతులు -1, వ్యాయమ విద్య - 1, కళా విద్య - 1, ఉర్దు మీడియంలో ఫిలాసఫీ, సోషియాలజీ - 1, సామాన్య శాస్త్ర బోధన పద్ధతులు -1, గణిత శాస్త్ర బోధన పద్ధతులు - 1, సాంఘిక శాస్త్ర బోధన పద్ధతులు -1, ఉర్దు బోధన పద్ధతులు -1, సబ్జెక్టులలో బోధనకు పీజీ చేసినవారు అర్హులని, ఏదైనా సందేహాలకు ఈ ఫోన్ నెంబర్ 9848285028 కు సంప్రదించాలని అన్నారు.

హరితహారంలో నగరానికి రాష్ట్ర స్థాయి గుర్తింపు

- ఎమ్మెల్యే కృషి ఫలితమే :మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర దశాబ్ది అవతరణ వేడుకల్లో భాగంగా ఉత్తమ హరితహారం నిర్వహణ నగరంగా నిజామాబాద్ నగరానికి వచ్చిన అవార్డుకు గాను ఎమ్మెల్యే గణేష్ గుప్తని మేయర్ శనివారం క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఆవిర్భావ వేడుకల్లో భాగంగా అర్బన్‌డే కార్యక్రమంలో లక్షకుపై జనాభా గల నగరం కేటగిరిలో ఉత్తమ హరితహారం నిర్వహణకు గాను మన నగరానికి వచ్చిన గుర్తింపు ఎమ్మెల్యే బిగాల కృషి పట్టుదల తోనే సాధ్యమైందని మేయర్ దండు నీతూ కిరణ్ అన్నారు. హైదరాబాద్ తరువాత నిజామాబాద్ నాగరాన్ని అద్భుతమైన కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు.

ఈగ గంగారెడ్డికి మాతృ వియోగం

నవతెలంగాణ-మోపాల్



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బారాస పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి తల్లి ఈగ గంగవ్వ (95) శనివారం మృతిచెందారు. రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా ప్రణాళిక సంఘం సభ్యులు బాజిరెడ్డి జగన్ నివాళులు అర్పించారు. అంత్యక్రియల్లో మాజీ ఎమ్ఎల్‌సి అరికెల నర్సారెడ్డి, నిజామాబాద్ మాజీ జడ్పీ చైర్మన్ గాదారి అనిత, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎస్ పోశెట్టి, మోకన్ పల్లి మాజీ సర్పంచ్ జనార్దన్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఈగ రమేష్ రెడ్డి, ఈగ కిషోర్ రెడ్డి, భూమ్ రెడ్డి, అభిలాష్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు

సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూటుమెంటు బోర్డు నిర్వహిస్తున్న సర్టిఫికేషన్ వెరిఫికేషన్ అదనపు డి.సి.పి (ఎ.ఆర్) గిరిరాజు ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించారు. నాల్గవ రోజు 650 మంది అభ్యర్థులను పిలవగా అందులో 578 మంది అభ్యర్థులు హజరయ్యారని, తెలిపారు. పరిపాలన అధికారి (ఎ.ఓ) బి. శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్ మక్సూద్ హైమద్, గోవింద్ సి.పి.ఓ కార్యాలయం సిబ్బంది, రిజర్వు) విభాగం సిబ్బంది ఐ.టి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.